సాక్షి
వికారాబాద్
గురువారం । 19 । డిసెంబర్ । 2024




సర్వర్ సమస్య!

ఇందిరమ్మ ఇళ్ల సర్వే నెమ్మదించింది. సర్వర్ సమస్యతో దరఖాస్తుదారుల వివరాల నమోదులో ఆలస్యం అవుతోంది. 8లో▸



అక్రమ రవాణాను..

మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ విభాగం సభ్యుడు అలీమోద్దీన్ అన్నారు. 8లో▸



అభివృద్ధికి నోచుకోని..

లింకురోడ్లు అభివృద్ధికి నోచుకోవడంలేదు. గ్రామాల మధ్య దూరం తగ్గించడానికి చేపట్టిన పనులు నత్తను తలపిస్తున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

పత్తి ధర తగ్గింపు

అనంతగిరి: పత్తి ధర తగ్గించనున్నామని మార్కెటింగ్ జిల్లా అధికారి సారంగపాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో రకం బీబీ స్పెషల్ మోడ్ నుంచి మెక్‌మోడ్‌గా మారడం వలన ధర తగ్గనుందని వివరించారు. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.7,471 (బీబీ స్పెషల్ మోడ్)ధరను చెల్లిస్తున్నామని, సీసీఐ అధికారుల ఆదేశాలతో రూ.50 తగ్గించి రూ.7,421(మెక్‌మోడ్)గా అమలు చేయనున్నామని వెల్లడించారు. ఇది గురువారం నుంచి అమలు కానుందని ఆయన పేర్కొన్నారు.

‘పట్నం’కు బెయిల్ మంజూరు

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు



బాణసంచాలు కాలుస్తున్న నాయకులు

దుద్యాల్: లగచర్ల ఘటనలో ఏ-1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి బుధవారం బెయిల్ మంజూరు అయింది. దీంతో మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. నినాదాలు చేస్తూ బాణసంచాలు కాల్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అక్రమంగా అరెస్టు చేసినా.. న్యాయ్యమే గెలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా రైతుల పక్షాన పోరాటం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు వెంకటయ్య, రమేశ్, బసిరెడ్డి, రాములు, కవిత, నర్సింహులు గౌడ్, రాజు తదితరులు ఉన్నారు.

జీవశాస్త్రం టెస్ట్‌లో విద్యార్థుల సత్తా



జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు చిత్రంలో ఉపాధ్యాయులు

దోమ: జిల్లా స్థాయిలో నిర్వహించిన జీవశాస్త్రం టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు సత్తాచాటారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శివారెడ్డిపేటలో తెలంగాణ జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. ఇందులో సుమారు 80 బాలబాలికలు పాల్గొన్నారు. మండలానికి చెందిన విద్యార్థి హరీశ్.. ఆంగ్ల మాధ్యమంలో ప్రథమ స్థానం సాధించగా, దాదాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన వైష్ణవి తృతీయ స్థానంలో నిలిచింది. తెలుగులో బడేంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన శ్రీకాంత్ జిల్లాలో ప్రథమ స్థానం సాధించి ఆదర్శంగా నిలిచాడు. ఈ మేరకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రతిభ చాటిన చిన్నారులను అభినందించారు. జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

మల్లన్న వ్యాఖ్యలు అర్థరహితం

బంట్వారం: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఎత్తివేయాలని తీన్మార్ మల్లన్న శాసన మండలిలో చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రాజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిజర్వేషన్లతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఇలాంటి పథకాన్ని తీసివేయాలనడం సముచితం కాదన్నారు. మల్లన్న తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘ప్రణాళిక’తో మెరుగైన ఫలితాలు

ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

పరిగి: ప్రణాళికతో చదివి.. వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇంటర్ విద్యాకమిషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 90 రోజుల ప్రణాళికను వెంటనే అమలు చేయాలన్నారు. కమిషన్ సూచించిన విధంగా చదివితే విద్యార్థులు మంచి మార్కులు సాధించవచ్చునన్నారు. ఏడాది కాలంలో ఈ సమయం చాలా కీలకమని, సమయాన్ని వృథా చేయరాదని పేర్కొన్నారు. అధ్యాపకులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రణాళికతో చదివించాలని సూచించారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని వెల్లడించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు భస్కరయోగి తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: ఆకుకూరలతో మార్కెటింగ్‌కు..



ధారూరు: తలపాగా కట్టుకుని పనికి..



తాండూరు రైల్వే స్టేషన్ వద్ద నూలు దుస్తుల విక్రయం



తాండూరు: కూరగాయల వ్యాపారులు

చలించని శ్రమజీవులు

రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- రాత్రిపూట 10 డిగ్రీల నమోదు
- ఎముకలు కొరికే చలితో జనజీవనం అస్తవ్యస్తం
- అలుపెరుగని శ్రమజీవుల జీవనపోరాటం

ఎముకలు కొరికే చలితో ప్రజలు గజగజా వణికిపోతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా విసురుతున్న చలి పంజాతో విలవిలలాడుతున్నారు. పడిపోతున్న ఉష్ణోగ్రతలతో బయటకు వెళ్లలేక.. ఇంట్లో ఉండలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముసుగు తన్నినా.. చలిమంటలు కాగినా ఉపశమనం పొందలేక పోతున్నారు. ఇంతటి తీవ్రత ఉన్నప్పటికీ.. శ్రమజీవుల జీవన పోరాటంపై ‘సాక్షి’ గ్రౌండ్ రిపోర్ట్.



తాండూరు: బస్‌స్టాండ్ ఎదుట పాల వ్యాపారి

ఆరెంజ్ జోన్‌లో జిల్లా

తాండూరు: చలి తీవ్రత కారణంగా జిల్లాను నాలుగు రోజులుగా వాతావరణ శాఖ ఆరెంజ్ జోన్‌గా ప్రకటించింది. రోజు మొత్తం గజగజా వణికిస్తుండటంతో రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొందరు చలితో పోరాటం చేస్తూనే.. ఉపాధి వేటలో ముందుకు సాగుతుండగా.. మరి కొందరు ఇంటికే పరిమితం అవుతున్నారు. తాండూరు నియోజకవర్గంలో కర్షకులతో పాటు కార్మికులు తెల్లవారు జామునే పనులకు వెళ్తుంటారు. పట్టణంలోని శాంతి మహల్ థియేటర్ వద్ద, తాండూరు పరిధి గ్రామాల నుంచి వచ్చిన అడ్డా కూలీలు తెల్లవారు జాము 6 గంటల నుంచి ఉపాధి కోసం రగ్గులు కప్పుకుని, స్వెటర్లు వేసుకుని నిరీక్షిస్తున్నారు. పనుల నిమిత్తం వ్యక్తిగత వాహనాల్లో పయనించేవారే కాకుండా.. ఆర్టీసీ బస్సుల్లో వెళ్లేవారిలో అత్యధికులు నూలు దుస్తులు ధరించే గమ్యస్థానాలకు వెళ్తున్నారు. మంచుదుప్పట్లో పాలు, పేపర్ బాయ్‌లు పరుగులు తీస్తున్నారు. పట్టణంలోని బసవణ్ణకట్ట వద్ద రైతులు, చిరువ్యాపారులు కూరగాయలు విక్రయిస్తున్నారు.



ఉపాధికోసం ఎదురు చూస్తున్న అడ్డా కూలీలు

జిల్లాలో మండలాల వారీగా ఉష్ణోగ్రతలు

మండలం	ఉష్ణోగ్రత
బంట్వారం	8.7
మర్పల్లి	8.6
పూడూరు	10.4
మోమిన్‌పేట్	8.8
కోట్‌పల్లి	9.6
ధారూరు	13.9
పెద్దేముల్	11.1
వికారాబాద్	12.2
నవాబుపేట్	11.3
కొడంగల్	9.3
బషీరాబాద్	10.5
యాలాల	10.9
కుల్కచర్ల	12.9
తాండూరు	11.9
దోమ	15.5
పరిగి	13.2
బొంరాస్‌పేట	11.5
చౌడాపూర్	13.2
దౌల్తాబాద్	12.7
దుద్యాల	12.4



తాండూరు: వీధులు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

పరిగి: చలిపంజా ఉగ్రరూపం దాల్చుతోంది. ఎముకలు కొరికే వాతావరణంతో జనజీవితం అస్తవ్యస్తంగా మారింది. రోజురోజుకూ ఉష్ణోగ్రత్తలు పడిపోతుండటంతో ప్రజలు బయటకు వెళ్లలేక పోతున్నారు. అత్యవసరమై వెలుపలకు వచ్చినవారు గజగజా వణికిపోతున్నారు. అయినప్పటికీ దినసరి కూలీలు, కులవృత్తుల వారు బతుకుపోరాటం చేస్తూనే ఉన్నారు. రైతులు, పారిశుద్ధ్య కార్మికులు, చిరు వ్యాపారులు చలిని లెక్క చేయకుండా జీవన సమరం సాగిస్తున్నారు. పాల వ్యాపారి, హోటల్ నిర్వాహకుడు, కూరగాయల విక్రయదారులు, పేపర్ బాయ్ ఇలా అనేక నిత్యవసరా సరకులు పంపిణీ చేసేవారు నిశీధిలోనూ నిరంతరం శ్రమిస్తున్నారు.

గీతకార్మికుల కుస్తి

ఇంతటి చలి తీవ్రత లోనూ గౌడన్నలు కుస్తీ పడుతున్నారు. ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా నడుముకు మోకుతో తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్నారు. చలితో నిర్లక్ష్యం చేస్తే.. కల్లు పారే చెట్టు అదనుతప్పి, జీవనోపాధి దెబ్బతింటుంది. దీంతో తప్పనిపరిస్థితుల్లో ఎముకలు కొరికే చలిలో ఆకాశాన్ని తాకేలా ఉన్న చెట్లను ఎక్కుతూ ఉపాధి పొందుతున్నారు.



దుప్పటి కప్పకుని..

చలి తీవ్రతతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో బయటకు, విధులకు వెళ్లాల్సిన నేపథ్యంలో నూలు దుస్తులు ధరించి మంచులో దూసుకుపోతుండగా.. సైకిల్‌పై వెళ్లే వారు నిండా దుప్పటి కప్పుకుని బతుకు పోరాటం చేస్తున్నారు.

మంచులో మత్స్యకారుల వేట

ఎముకలు కొరికే చలిలో మత్యకారులు చెరువుల్లో చేపలు పడుతున్నారు. తెప్పలు వేసుకుని తెల్లవారు జామున వేటకు వెళ్తున్నారు. ఓవైపు చలి, మరోవైపు అంతకంటే ఎక్కువగా ఉన్న చల్లని నీటిలో చేపల వేట కొనసాగిస్తున్నారు. అనంతరం మార్కెట్‌కు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు.

కాలం ఏదైనా నేలతల్లి ఒడిలో..

నేలతల్లిని నమ్ముకున్న రైతన్నల పరిస్థితి మరింత దారుణం. చలితీవ్రతతో అందరూ అల్లాడిపోతున్నా.. కర్షకులు మాత్రం నిరంతరం పొలాల్లో శ్రమిస్తున్నారు. ఎండ, వాన, చలి ఇలా కాలం ఏదైనా.. పొలం బాటలో బిజీగా ఉంటున్నారు. మూగజీవాలను మేపుతూ.. పాలు పితుకుతూ, పొలం పనుల్లో నిమగ్నం అవుతున్నారు.



వాహనదారులు జాగ్రత్త



పరిగి: చలితో వాహనదారులు జాగ్రత్తగా ఉండాలి. కార్లు, గూడ్స్ వాహనదారులు తప్పకుండా ఫాగ్‌లైట్లను వేసుకోవాలి. ఉదయం 8 గంటల వరకు పొగమంచు ఉంటుంది. ఈ లైట్ల వలన ప్రమాదాలను నివారించవచ్చు. ద్విచక్ర వాహనదారులు హెడ్‌లైట్స్, ఇండికేటర్స్‌ను వాడాలి. దూరం పాటిస్తూ ముందుకు సాగాలి. రోడ్డుపై బండి ఆపినప్పుడు పార్కింగ్ లైట్స్, ఇండికేటర్లు వేయాలి.

– వీరేందర్‌నాయక్, ఎంవీఐ, పరిగి

మూగజీవాలకు ముప్పు



యాలాల: చలి తీవ్రతతో పశువులకు లంపీ స్కిన్ సోకే అవకాశం ఉంది. దూడలు పుర్రు రోగం బారిన పడతాయి. దీని నివారణకు రైతులు విధిగా పీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలి. కోళ్లకు రాణికెట్ (కొక్కెర) వ్యాధి సోకకుండా.. నివారణకు లసోటా వ్యాక్సిన్ వేయించాలి. పాడి పశువులు, ఆవులను ఆరు బయట కట్టేయడం వలన పాల ఉత్పత్తి తగ్గుతుంది. రాత్రి వేళ కొట్టాలు లేదా షెడ్లలో ఉంచాలి. పశువుల కొట్టాలు, కోళ్ల ఫారాల చుట్టూ గోనె సంచులు కట్టాలి.

– శివప్రసాద్, మండల పశువైద్యుడు, యాలాల



తాండూరు: మంచుతెరలో పేపర్ బాయ్ పరుగు



పరిగి: పొలం వద్దకు వెళ్తున్న అన్నదాత



పరిగి: చేపలు పడుతున్న మత్స్యకారులు



యాలాలలో..

విద్యార్థుల సంక్షేమానికి కృషి

- కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్
- కుదురుమల్ల పాఠశాలలో అల్పాహారం ప్రారంభం

దుద్యాల్: విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. అందులో భాగంగానే బాలబాలికలకు అల్పాహారం అందజేస్తుందని తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్‌ను ఎంఈఓ విజయరామారావ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మేరుగు వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు ఉదయం వేళలో వారి ఇంట్లో వంట కాకపోవడంతో తినకుండా పాఠశాలలకు వస్తున్నారని పేర్కొన్నారు. అలా వచ్చిన వారు ప్రార్థన సమయంలో, తరగతి గదిలో సొమ్మసిల్లి పడిపోతున్నారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు గతంలో చాలా చోట్ల జరిగాయని గుర్తు చేశారు. వాటన్నింటిని గమనించిన ప్రభుత్వం.. ఉదయం పూట పిల్లల ఆకలి తీర్చేందుకు హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేసిందని వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిరంజన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రఘుపతి, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, యువజన అధ్యక్షుడు శ్రీకాంత్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు మల్లప్ప, అభయ్ కుమార్, రమేశ్, రాములు, సుధాకర్, రవీందర్ గౌడ్, మాధవి, సాలిబాయి, ముకుంద రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



అల్పాహారం తింటున్న విద్యార్థులు

పత్తి రైతులకు తప్పని తిప్పలు

- మిల్లువద్ద దళారుల పెత్తనం
- వ్యాపారులకే తొలిప్రాధాన్యత ఇస్తున్న యాజమాన్యం
- ఆందోళన చేపట్టిన అన్నదాతలు

ధారూరు: తెల్లబంగారం పండించిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. సాగు చేసిన కాలం ఒకెత్తు అయితే.. దిగుబడిని విక్రయించడం మరో ఎత్తుగా భావిస్తున్నారు. తీరా పంటను కొనుగోలు కేంద్రం వద్దకు తెచ్చినా.. దళారుల పెత్తనమే కొనసాగుతుండటం జీర్ణించుకోలేక పోతున్నారు. ధారూరు మండలంలోని నాగసమందర్‌లో ఏర్పాటు చేసిన కాటన్ మిల్లులో దళారులు ఇష్టారాజ్యం పెరిగిపోయింది. వారు తెచ్చిన పత్తినే నిర్వాహకులు తొలుత తూకం వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

సహనం కోల్పోయిన కర్షకులు..

బుధవారం సాయంత్రం మిల్ వద్ద పత్తి రైతులు ఆందోళనకు దిగారు. తాము తెచ్చిన పంటను తూకం వేయకుండా.. పత్తిలోడుతో ఉన్న తమ వాహనాలను లోపటికి అనుమతించకుండా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డుపైనే నిలిపి వేశారని, దళారులు తెచ్చిన పత్తినే కాంటా పెట్టారని ఆరోపించారు. కొనుగోలులో ఆలస్యం జరిగితే.. మద్దతు ధరలో కోత పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం క్వింటాల్‌కు పత్తి ధర రూ.7,471 ఉండగా.. గురువారం నుంచి రూ.7,421 చెల్లిస్తారని, క్వింటాకు రూ.50 నష్టపోవాల్సి వస్తుందని పలువురు పేర్కొన్నారు. మిల్లు యజామానితో వ్యాపారులు కుమ్మక్కై.. వారి పత్తిని అమ్ముకుని లబ్ధిపొందుతూ.. తమను నష్టపరుస్తున్నారని వాపోయారు. ఇంత జరుగుతున్నా.. పత్తి రైతును ఎవరూ పట్టించుకోవడం విమర్శించారు. ఆందోళన అనంతరం రాత్రి 7 గంటలకు తమ దిగుబడిని తూకం వేశారని తెలిపారు. ఆలస్యంగా కొనుగోలు చేసినా.. పాత ధరనే చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై గురువారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ధర తగ్గిస్తే ఊరుకునేది లేదని స్పష్టంచేశారు.



మిల్లు సిబ్బందితో రైతుల వాగ్వివాదం



రోడ్డుపైనే ఉన్న రైతుల పత్తిలోడు వాహనాలు

క్లుప్తంగా

రూరల్ సీఐని కలిసిన యాలాల ఎస్ఐ



యాలాల: సీఐని కలిసిన ఎస్ఐ గిరి

యాలాల: రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న నగేశ్‌ను యాలాల ఎస్ఐ గిరి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రూరల్ పరిధిలోని యాలాల మండల వివరాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎక్కువగా నమోదయ్యే కేసులు, సమస్యలను తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని ఎస్ఐకు సూచించారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన కంకల్ విద్యార్థి



బహుమతి అందుకుంటున్న విద్యార్థి

పూడూరు: వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్‌లో కంకల్ పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రకాశ్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం పుష్పా తెలిపారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ బహుమతి అందజేశారు. విద్యార్థి ప్రకాశ్ రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపిక కావడంతో పాఠశాల అధ్యాపక సిబ్బంది అభినందించారు.

వాహనాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి



వాహనాల తనిఖీలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సంతోశ్‌కుమార్

పరిగి: వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన వాహనాలను నడపడం నేరమన్నారు. ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని తెలిపారు. అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ తీసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు వదిలిన వ్యక్తి

యాచారం: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లి పోయాడు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మాల్ గ్రామానికి చెందిన కోపరాతి వెంకటరమణ(45) వెల్డింగ్ వృత్తి చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. వెల్డింగ్ దుకాణం నుంచి మంగళవారం ఉదయం వెళ్లి పోయాడు. 24 గంటలు గడిచినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.



జాగ్రత్తలతో మేలు

తాండూరు: చలి తీవ్రత, కాలుష్యంతో సీజనల్ వ్యాధుల బాధితుల సంఖ్య పెరిగింది. పొగమంచు, చలిగాలుల వలన వృద్ధులకు గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. శస్త్ర చికిత్స పొందిన వారు ఇంట్లో ఉంటే మంచిది. వేడి వేడి ఆహారాన్ని భుజించాలి. వృద్ధులు చిన్నారులు పడుకునే గదుల్లో హీటర్లు ఏర్పాటు చేసుకోవాలి. లేదంటే మందమైన రగ్గులు, దుప్పట్లు కప్పుకోవాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు చలితో ఇన్ఫెక్షన్‌ల బారిన పడే అవకాశం ఉంది. మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారు.. నూలు దుస్తులు ధరించాలి. సీజనల్ వ్యాధులకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ ఆనంద్ గోపాల్‌రెడ్డి, ఆర్ఎంఓ, జనరల్ ఫిజీషియన్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, తాండూరు



సర్వర్ సమస్య!

- ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జాప్యం
- వివరాల నమోదులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్యదర్శులు
- ఈ నెలాఖరు వరకు గడువు

దౌల్తాబాద్: మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వే నెమ్మదిగా కొనసాగుతుంది. ఇందిరమ్మ యాప్ సర్వర్ సమస్యతో దరఖాస్తుదారుల వివరాల నమోదులో ఆలస్యం అవుతుంది. గతేడాది నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా లబ్ధిదారులకు ఈ నెల 12నుంచి గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు ఎంపిక కోసం సర్వే చేపడుతున్నారు. ఒక్కో కార్యదర్శికి 500 దరఖాస్తులు సర్వే చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఈ సర్వేను ఈ నెల 31వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించింది. మండలంలో 5వేలకుపైగా మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 30శాతం వరకు పరిశీలన పూర్తయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.



దౌల్తాబాద్‌లో దరఖాస్తుదారు వివరాలు నమోదు చేస్తున్న కార్యదర్శి

ఇల్లున్న వాళ్లే దరఖాస్తు...

పలు గ్రామాల్లో కొందరికి సొంత ఇల్లున్నప్పటికీ లేదని పేర్కొంటూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో సర్వేకు వెళ్లిన పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తుదారులకు సొంతిల్లు ఉన్నట్లు గుర్తిస్తున్నారు. మరికొందరు సొంతింట్లో ఉన్నప్పటికీ అద్దె ఇంట్లో ఉంటున్నామని కార్యదర్శులతో చెబుతున్నారు. ఇంటి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఒప్పుకోవడంలేదు. ఫొటో అప్‌లోడ్ చేస్తే కొత్త ఇల్లు మంజూరు కాదంటూ కార్యదర్శులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి ఇల్లు లేదని వివరాలు నమోదు చేయించుకుంటున్నట్లు తెలుస్తుంది.

ఒక్కో ఇంటికి 15 నుంచి 20 నిమిషాలు..

దరఖాస్తుదారుల ఇంటి వివరాలు నమోదు చేసేందుకు సర్వర్‌లో నెలకొన్న సమస్యతో పంచాయతీ కార్యదర్శులు ప్రారంభంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సర్వర్ స్లోగా మారడంతో పాటు ఇంటర్నెట్ సరిగ్గా లేకపోవడంతో దరఖాస్తుదారుల ఇంటి వివరాలు నమోదు చేసి ఫొటోలను అప్‌లోడ్ చేయడానికి ఆలస్యమవుతుంది. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలు, ఫొటోలను నమోదు చేసేందుకు సుమారు 15నుంచి 20నిమిషాలు సమయం పడుతుందని కార్యదర్శులు పేర్కొంటున్నారు.

ఎస్ఎస్ఏల సమస్యలు పరిష్కరించాలి

అనంతగిరి: విద్యాశాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మె బుధవారానికి 13వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా వికారాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయం ముందు చేపడుతున్న సమ్మెకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, రాష్ట్ర నాయకులు మారుతి కిరణ్, పాండుగౌడ్ తదితర నాయకులు సంఘీభావం తెలిపి మద్దతు పలికారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఆయా విభాగాల ముఖ్య నాయకులు శేఖర్, వెంకట్‌రెడ్డి, రఘు, మోహన్, మీన, దశరథ్, రవి, చంద్రశేఖర్, విజయ్, వేణుగోపాల్, కృష్ణవేణి, జ్యోతి రవికుమార్, ప్రభావతి, రాజేశ్వరి, స్వరూప, స్రవంతి, ఆశాలతా, మంగమ్మ, పల్లవి, శైలజ, రాధిక, ఇందిరా తదిరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న మాధవరెడ్డి తదితరులు

నిప్పంటుకొని కంది పంట దగ్ధం

ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకోలు



ఊటుపల్లిలో కాలిన కంది పంటను చూసి ఆందోళన చెందుతున్న బాధిత రైతు

దోమ: కంది పంటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైన ఘటన దోమ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఊటుపల్లి గ్రామానికి చెందిన బండి నర్సయ్య అనే రైతు తనకున్న వ్యవసాయ పొలంలో రెండెకరాల కంది పంటను సాగు చేశారు. ప్రమాదవశాత్తు కంది పంటకు నిప్పంటుకోవడంతో పూర్తిగ దగ్ధమైంది. అప్పులు తెచ్చి పంట సాగు చేశాడని బాధిత రైతు కన్నీటిపర్యాంతమయ్యాడు. సుమారు రూ. లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తనను ప్రభుత్వం ఆదుకుకోవాలని కోరారు.

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు అల్పాహారం

జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: సర్కారు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం పూట అల్పాహారం కార్యక్రమం సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులకు విందుగా భావించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఏర్పుమళ్ల, బొంరాస్‌పేట, నాందార్‌పూర్, ఎన్కేపల్లి, మెట్లకుంట, తుంకిమెట్ల తదితర పాఠశాలల్లో అల్పాహారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రార్థనా సమయంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత గల భోజనంతో పాటు అల్పాహారం అందించడం అభినందనీయమన్నారు. చుట్టుపక్కల గ్రామాలు, తండాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు మరింత ఆసరానిస్తుందన్నారు. దీనిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.



అల్పాహారం ప్రారంభిస్తున్న నాయకులు అధికారులు

ఖోఖో జాతీయ పోటీలకు చందు



చందుయాదవ్

యాలాల: ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు మండలంలోని గౌతమి పాఠశాలకు చెందిన విద్యార్థి చందుయాదవ్ ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన చందును జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ టీంలోకి తీసుకున్నారు. ఈ నెల 21నుంచి 24 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహిపాల్ రెడ్డి, సంగారెడ్డి, ప్రిన్సిపల్ కొండారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్‌రెడ్డి, పీఈటీ గఫార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు అసెంబ్లీ ముట్టడి



తాండూరు టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న మాల సంఘం నాయకులు

తాండూరు టౌన్: ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తే సహించేది లేదని పలువురు మాల సంఘాల నాయకులు హెచ్చరించారు. బుధవారం తాండూరు పట్టణంలో వారు సమావేశంలో వివరాలు వెల్లడించారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై సూచన మాత్రమే చేసిందని, వర్గీకరణ చేపట్టాలని తీర్పులో వెల్లడించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలుచేయనున్న సందర్భంగా దీనికి నిరసనగా గురువారం లక్షలాది మాలలతో అసెంబ్లీ ముట్టడిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మాల సంఘం నాయకులు పటేల్ కిష్టయ్య, మల్లప్ప, జగదీశ్, హన్మంతు, ఎల్లప్ప, అంజిలప్ప, శ్రీనివాస్, రాములు, శేఖర్, కృష్ణ, విజయ్, నరేశ్, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడిలో

కుల్కచర్ల: అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ రాష్ట్ర మాలమహానాడు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేయనున్నట్లు జిల్లా పరిధిలోని మాల మహానాడు కార్యకర్తలు, నాయకులు ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నవాబుపేట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శివరాజ్, మండల మాల మహానాడు అధ్యక్షుడు శ్యాములు ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్‌లో గడ్డి దగ్ధం

నందిగామ: పశుగ్రాసం(వరి గడ్డి) లోడుతో వెళ్తున్న ట్రాక్టరుకు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైన ఘటన మండల పరిధిలోని రంగాపూర్ శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. రంగాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన సల్వేంద్రిగూడకు చెందిన పాశం భిక్షపతి కేశంపేట మండలం అల్వాల్‌లో రూ.30 వేలు వెచ్చించి వరి గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో స్వగ్రామానికి తీసుకొస్తున్నాడు. మార్గమధ్యలో గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద విద్యుత్ తీగలు ట్రాక్టరులోని గడ్డి మోపులకు తగిలి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు గమనించి కేకలు వేయగా.. డ్రైవర్ ట్రాక్టర్ ట్రాలీని పైకి లేపడంతో గడ్డి మోపులు కింద పడి పోయాయి. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఐదు నిమిషాల వ్యవధిలో తమ పశువుల పాక వద్దకు ట్రాక్టరు చేరుకునే అవకాశం ఉండగా.. అంతలోనే ప్రమాదం చోటు చేసుకోవడంతో రైతు భిక్షపతి కన్నీరుమున్నీరుగా విలపించాడు.



దగ్ధమవుతున్న ట్రాక్టర్‌లోని పశుగ్రాసం

అల్లాపూర్ దొంగతనం కేసులో మరొకరు అరెస్ట్

రిమాండ్‌కు తరలింపు



షాదుల్లా

తాండూరు రూరల్: మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులో బోరు మోటార్ రివైండింగ్ షాపు దొంగతనం కేసులో కరన్‌కోట్ పోలీసులు బుధవారం మరో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 29వ తేదీన అల్లాపూర్ గ్రామ శివారులో మోటారు రివైండింగ్ దుకాణంలో దొంగతనం చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ఆరుగురిని గుర్తించారు. కొన్ని రోజుల క్రితం అస్లాం, సాబేర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో ఏ2గా ఉన్న షాదుల్లాను అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. మిగత ముగ్గురు పరారిలో ఉన్నారని వారిని కూడా త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

టెంట్‌హౌస్ సామగ్రి రికవరీ...

అల్లాపూర్‌లో బోరు మోటార్ల దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్న షాదుల్లాను పోలీసులు విచారించగా శంకర్‌పల్లిలోని పర్వేదలో కూడా టెంట్‌హౌస్ సామగ్రిని దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అల్లాపూర్‌లో దొంగతనానికి నాలుగు రోజుల ముందు శంకర్‌పల్లిలో దొంగతనం చేసినట్లు విచారణలో తేలిందని ఎస్ఐ విఠల్‌రెడ్డి చెప్పారు. అయితే టెంట్‌హౌస్ సామగ్రిని కొంత అమ్ముకోగా మిగత కరన్‌కోట్ పోలీసులు రికవరీ చేసి శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేశారన్నారు. రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్న షాదుల్లాను బుధవారం రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం



గాయపడ్డ తలారి బుగ్గయ్య

కుల్కచర్ల: ఇంటి నుంచి పొలానికి వెళ్తున్న ఆటో బోల్తాపడిన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గర్క రాములు అనే ఆటో డ్రైవర్ గ్రామానికి చెందిన కాకి రాములుకు సంబంధించిన నాగలిని తన పొలానికి తీసుకువెళ్లేక్రమంలో గేదె ఎదురురావడంతో తప్పించబోయి ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో తలారి బుగ్గయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతనిని స్థానికులు 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఆటోలోని మరో ముగ్గురికి స్వల్పగాయాలవ్వడంతో స్థానిక ప్రయివేటు ఆసుపత్రులల్లో చికిత్స నిమిత్తం తరలించారు.



బోల్తాపడిన ఆటో

ఒగ్గుడోలు శిక్షణ శిబిరం ప్రారంభం



ఎన్కెపల్లిలో ఒగ్గుడోలు శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

యాలాల: మండలంలోని ఎన్కెపల్లిలో ఒగ్గుడోలు శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, మల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి నాందార్‌పూర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 21 రోజుల పాటు రోజుకు 10 గంటల వరకు శిక్షణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన వంద మంది విద్యార్థులకు 32రకాల అడుగులు, దరువులతో విన్యాసం నేర్పించనున్నట్లు ఒగ్గు బీరు శిక్షకులు శివకుమార్, రాఘవేందర్, మల్లేశ్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో ఎన్కెపల్లి గ్రామ పెద్దలు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకర్, పూజారి కిష్టప్ప, ఒగ్గుబీర్ల సంఘం అధ్యక్షుడు పూజారి శాంతప్ప, ప్రతినిధులు శంకరప్ప, చంద్రయ్య, మల్లప్ప, జగదీశ్, పాండు, గోరేపల్లి సతీశ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

శాసనమండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేత

కడ్తాల్: రాష్ట్రంలో సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే ప్రభుత్వం నుంచి విడుదల చేయించాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్సీలు కవిత, నవీన్‌రెడ్డిలతో కలిసి శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 2019–2024 కాల వ్యవధిలో సర్పంచ్‌లుగా కొనసాగి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలాభివృద్ధికి కృషి చేశామన్నారు. పెండింగ్ బిల్లులు రాక రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే బిల్లులు విడుదల చేసే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు.



ఎమ్మెల్సీలు కవిత, నవీన్‌రెడ్డిలతో కలిసి మండలి ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

అంబులెన్స్‌లో ప్రసవం

కేశంపేట: అంబులెన్స్‌లో ఓ గర్భిణీ పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన మౌనిక పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది ఆమెను కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా వేములనర్వ గ్రామ శివారులో నొప్పులు అధికమయ్యాయి. వెంటనే అంబులెన్స్‌ను ఆపి కుటుంబ సభ్యుల సహకారంతో ఈఆర్‌సీపీ డాక్టర్ మనిష్, ఈఎంటీ సాయికృష్ణ, పైలెట్ దీపక్ ఆమెకు సుఖ ప్రసవం చేశారు. మౌనిక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



శిశువును కుటుంబ సభ్యులకు అందిస్తున్న 108 సిబ్బంది

మానవ అక్రమ రవాణాను అరికడుదాం



విద్యార్థులతో అలీమొద్దీన్

అక్రమ నిరోధక విభాగం సభ్యుడు అలీమొద్దీన్

దోమ: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మానవ అక్రమ నిరోధక విభాగం సభ్యుడు అలీమొద్దీన్ అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్థానిక పోలీసులతో కలిసి విద్యార్థులకు యాటీజింగ్, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలు, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, మహిళ రక్షణ, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు ఎదురైనప్పుడు వారితో జాగ్రత్తగా ప్రవర్తించాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తులు బాలలను అపహరించడమే కాకుండా వారితో సంఘ విద్రోహపనులు, వెట్టిచాకిరి వంటి పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు టోల్ ఫ్రీనంబర్ 1098కు లేదా 100 డయాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ భీంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతీఒక్కరికి అవగాహన అవసరం

దోమ: చట్టాలపై ప్రతీఒక్కరికి అవగాహన అవసరమని షీటీం ఇంచార్జి నర్సింహులు అన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని కిష్టాపూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలతో పాటు గ్రామీణ ప్రాంత యువకులు, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, బాల్య వివహాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న 181కు కాల్ చేయాలన్నారు. మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం పూర్తిగా కట్టడి చేయాలన్నారు. సైబర్ క్రైమ్‌లో ఎలాంటి మోసాలు జరిగిన 1930కి కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కరణం శ్రీకాంత్‌రావు, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు మనీషా, శోభరాణి పాల్గొన్నారు.



దోమ: కిష్టాపూర్ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న షీటీం ఇంచార్జి నర్సింహులు